క్లుప్తంగా

మోడల్ స్కూల్ విద్యార్థులకు స్క్రీనింగ్ టెస్ట్‌లు

పెద్దతిప్పసముద్రం : ఆయుష్మాన్ భారత్ హెల్త్ కార్డుల ప్రక్రియలో భాగంగా బుధవారం స్థానిక మోడల్ స్కూల్ విద్యార్థులకు స్క్రీనింగ్ టెస్ట్ నిర్వహించారు. ప్రిన్సిపాల్ శివకుమారి పర్యవేక్షణలో స్థానిక పీహెచ్‌సీ డాక్టర్ మహమ్మద్ యస్దానీ, వైద్య సిబ్బందితో కలసి విద్యార్థులకు ఆరోగ్య, వైద్య పరీక్షలు నిర్వహించారు.

ప్రభుత్వ ఆస్పత్రికి మంచాల వితరణ

పీలేరు : మండలంలోని కూరపర్తివారిపల్లెకు చెందిన రిటైర్డ్ హెడ్మాస్టర్ బద్దల రాజారెడ్డి స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి సాయమందించడం అభినందనీయమని సూపరింటెండెంట్ డాక్టర్ చంద్రశేఖర్ అన్నారు. తన తల్లిదండ్రులు సిద్దమ్మ, నాగిరెడ్డిల జ్ఞాపకార్థం రాజారెడ్డి బుధవారం రూ.1.40 లక్షల విలువైన 12 మంచాలు, బెడ్లు, దిండ్లు, వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు చంద్రారెడ్డి, సభ్యులు నరసింహారెడ్డి, ఆంజనేయులు, కృష్ణయ్య, ఆర్‌ఎంవో సరస్వతమ్మ, షరీఫ్‌జాన్, డాక్టర్ ఉషశ్రీ, నరేష్, రెడ్డెప్ప, గురుస్వామి తదితరులు పాల్గొన్నారు.

కెనరా బ్యాంకు సేవలు సద్వినియోగం చేసుకోండి

పీలేరురూరల్ : కెనరా బ్యాంకు సేవలు సద్వినియోగం చేసుకోవాలని ఆ శాఖ మేనేజర్ హరిప్రసాద్ అన్నారు. పట్టణంలోని స్థానిక క్రాస్ రోడ్డులో బ్యాంకు సేవలపై బుధవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖాతాదారులు బ్యాంకు ద్వారా అభివృద్ధి చెందడానికి ఆకర్షణీయమైన పథకాలు అందుబాటులో ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు సిబ్బంది అశోక్‌కుమార్, సందీప్, శివలలిత తదితరులు పాల్గొన్నారు.

మల్లయ్యకొండపై అటవీశాఖ అధికారులు

తంబళ్లపల్లె : మల్లయ్యకొండను బుధవారం అటవీశాఖ అధికారులు సందర్శించారు. సబ్ డీఎఫ్‌ఓ శ్రీనివాసులు, రేంజర్ జయప్రసాద్‌రావులకు ఆలయ పూజారి ఈశ్వరప్ప స్వాగతం పలికి స్వామి ప్రత్యేక అలంకరణతో పూజలు, అభిషేకాలు నిర్వహించారు. కొండపై జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. అటవీశాఖ ఆధ్వర్యంలో చేపట్టబోయే అభివృద్ధి పనులకు గుర్తించిన స్థలాలను పరిశీలించారు. అడవులను అగ్నిబారిన పడకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. వారి వెంట ఎఫ్‌ఎస్‌ఓ రెడ్డివరప్రసాద్, ఎఫ్‌బిఓ రామ్‌రాజ్ తదితరులు ఉన్నారు.

రైతు గుర్తింపు కార్డుతోనే ప్రభుత్వ పథకాలు

గుర్రంకొండ : రాబోయే రోజుల్లో రైతు గుర్తింపు కార్డుతోనే ప్రభుత్వ పథకాలు అందుతాయని మండల వ్యవసాయాధికారిణి రత్నమ్మ పేర్కొన్నారు. మండలంలోని తరిగొండ, శెట్టివారిపల్లె గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాల్లో రైతులతో బుధవారం జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ రైతులు తప్పని సరిగా రైతు గుర్తింపు కార్డులు తీసుకోవాలన్నారు. తమ భూమి రికార్డులు, వన్‌బీ, ఆధార్ కార్డు జిరాక్స్ కాపీలతో పాటు తమ సెల్‌ఫోన్ నెంబర్ తీసుకొని రైతు సేవా కేంద్రాల్లో తమ సిబ్బందిని సంప్రదించాల్సి ఉంటుందన్నారు. ఆన్‌లైన్‌లో గుర్తింపు కార్డులు నమోదు ప్రక్రియ పూర్తి చేసుకొన్న వారికి త్వరలో గుర్తింపుకార్డులు జారీ చేస్తామన్నారు. రాయితీ విత్తనాలు, ఎరువులు, పీఎం కిసాన్ డబ్బులు, అన్నదాత సుఖీభవ, పంట నష్టపరిహారం, బ్యాంకుల్లో పంట రుణాలు అందుతాయన్నారు. రైతులు తప్పనిసరిగా గుర్తింపు కార్డులు పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో సలీం, వెంకటరమణ, రైతులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల బలోపేతానికి చర్యలు

నిమ్మనపల్లె : అంగన్‌వాడీ కేంద్రాలలో పూర్వ ప్రాథమిక విద్యకు పటిష్ట పునాది వేసి, బలోపేతం చేయడానికి ప్రభుత్వం పూర్తిస్థాయిలో చర్యలు చేపడుతోందని మదనపల్లి సీడీపీఓ సుజాత అన్నారు. బుధవారం రెడ్డివారిపల్లిలో అంగన్‌వాడీ టీచర్లకు జ్ఞాన జ్యోతి కార్యక్రమం ద్వారా ఇస్తున్న శిక్షణను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సాల్ట్ కార్యక్రమంలో భాగంగా నిర్వహిస్తున్న జ్ఞాన జ్యోతి కార్యక్రమం ద్వారా అంగన్‌వాడీలకు 120 రోజుల పాటు ప్రత్యేక శిక్షణను అందించి, అర్హత కలిగిన వారికి ధ్రువీకరణ పత్రాలను అందించనున్నట్లు తెలిపారు. అందులో భాగంగా మొదట విడత ఈనెల 18వ తేదీ నుంచి 25వ తేదీ వరకు ఆరు రోజులపాటు శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. అంగనవాడీ కార్యకర్తలు జ్ఞాన జ్యోతి శిక్షణ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకొని, ధ్రువీకరణ పత్రాలను అందుకోవాలన్నారు.

వివేకానంద సర్కిల్‌లో మద్యం దుకాణం వద్దు

పీలేరురూరల్: పట్టణంలోని వివేకానంద సర్కిల్ నందు మద్యం దుకాణం పెట్ట వద్దని స్థానికులు కోరారు. దుకాణం పెట్టేందుకు బుధవారం నాయకులు సిద్ధం అవుతుండడంతో స్థానికులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ ప్రాంతంలో ఆస్పత్రులు, విద్యా సంస్థలు ఉన్నాయని, మద్యం షాపు ఏర్పాటుచేస్తే విద్యార్థులు తీవ్ర అసౌకర్యానికి గురవుతారన్నారు. అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వైద్యులు డాక్టర్ దినేష్‌కుమార్‌రెడ్డి, డాక్టర్ గిరీష్, డాక్టర్ శేఖర్, వీఎస్‌ఎన్ పాఠశాల కరస్పాండెంట్ మాధవి, రియాజ్ పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలు నట్టేట ముంచాయి

పంట దిగుబడి లేక పీకల్లోతు అప్పుల్లో అన్నదాతలు



కోసిన పుచ్చకాయల దుస్థితి ఇది



చిన్న సైజు కాయలను చూపుతున్న పుచ్చకాయ రైతు

పెద్దతిప్పసముద్రం : పది మందికి అన్నం పెట్టే అన్నదాతలు నకిలీ విత్తనాలు, ఎరువుల కారణంగా నిత్యం మోసపోతూ పీకల్లోతు అప్పుల్లో కూరుకుపోతున్నారు. మండల కేంద్రానికి చెందిన సౌదాగర్ పర్వేజ్ అనే రైతు తనకున్న మూడున్నర ఎకరాల పొలంలో పుచ్చకాయ పంటను సాగు చేయాలని నిర్ణయించుకున్నాడు. ఈ నేపథ్యంలో గత ఏడాది డిసెంబర్ 17న ములకలచెరువులోని పోలీస్‌స్టేషన్ ఎదురుగా ఉన్న ఓ పెస్టి సీడ్స్ దుకాణంలో పుచ్చకాయ విత్తనాలను కొనుగోలు చేశాడు. 50 గ్రాముల ప్యాకెట్‌ను రూ.1,530 చొప్పున 15 ప్యాకెట్లను కొనుగోలు చేసి పంటను సాగు చేశాడు. అప్పటి నుంచి కంటికి రెప్పలా కాపాడుకుంటూ పంటకు క్రిమి సంహారక మందులు వాడినా పంట కాలం పూర్తయినా ఎలాంటి దిగుబడి లేకపోయింది. నకిలీ విత్తనాలే ఇందుకు కారణమని భావించిన రైతు పెస్టిసైడ్ దుకాణాదారున్ని సంప్రదిస్తే తనకేం సంబంధం లేదని, వైరస్ వల్ల ఇలా జరిగి ఉండవచ్చని, ఏమైనా ఉంటే రైల్వే కోడూర్‌లో ఉన్న సీడ్ కంపనీ డీలర్‌ను అడుక్కోమని నిర్లక్ష్యంగా సమాధానమిచ్చినట్లు రైతు వాపోయాడు. అంతేగాక తాము విత్తనాలు, ఎరువులు, క్రిమి సంహారక మందులు కొనుగోలు చేసినా కూడా దుకాణదారులు విత్తన, ఎరువులకు సంబంధించి ఎలాంటి రశీదులు ఇవ్వడం లేదని ఇప్పటి వరకు పంటపై రూ.2.70 లక్షల వరకు ధారపోసి నష్టపోయానని ఇప్పుడు మా గోడును ఎవరికి చెప్పుకోవాలని రైతు కంట తడి పెడుతున్నాడు. అక్కడక్కడా కోతకు వచ్చిన చిన్న సైజు పుచ్చకాయలను కోస్తే లోపల భాగం అంతా ఎరుపుకు బదులుగా తెల్లగా ఉందని రైతు వాపోయాడు. బిల్లులు ఇస్తే రైతులు ప్రశ్నించే అవకాశం ఉంటుందని భావించిన దుకాణాదారులు రైతులను నకిలీ విత్తనాలు, నకిలీ మందుల అంటగడుతూ నిలువునా ముంచుతున్నారని రైతులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. వ్యవసాయ శాఖ అధికారులు నిత్యం ఫెర్టిలైజర్, పెస్టిసీడ్స్‌దుకాణాలను నిత్యం తనిఖీ చేసి వారు విక్రయించే విత్తనాలు, మందుల శ్యాంపిళ్ళను ల్యాబ్‌లకు పంపి రైతులు నష్టపోకుండా ప్రత్యేక చొరవ చూపాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. అదే విధంగా నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని అన్నదాతలు విన్నవిస్తున్నారు.

డీఎస్సీ పేరుతో నిరుద్యోగులకు మెగా దగా

మదనపల్లె సిటీ : మెగా డీఎస్సీ పేరుతో నిరుద్యోగులను కూటమి ప్రభుత్వం మోసం చేస్తోందని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త ఎస్. నిస్సార్ అహ్మద్ అన్నారు. బుధవారం మదనపల్లె మండలం అంకిశెట్టిపల్లె వైఎస్సార్‌సీపీ సర్పంచు శరత్‌రెడ్డి అన్న అశోక్‌రెడ్డి నూతన గృహప్రవేశ కార్యక్రమానికి తంబళ్లపల్లె ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డితో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారంలోకి వచ్చిన వెంటనే మెగా డీఎస్సీ నిర్వహిస్తామని ఇప్పటి వరకు నిర్వహించకపోవడంతో నిరుద్యోగులు నిరాశకు గురవుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ నరేష్‌కుమార్‌రెడ్డి, ఎస్సీ సెల్ అధ్యక్షుడు ఈశ్వర్‌నాయక్, రవిచంద్రారెడ్డి, కొత్తపల్లి మహేష్, చిప్పిలి మల్లికార్జునరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



గృహప్రవేశ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి, నిస్సార్ అహ్మద్

కమనీయం.. లక్ష్మీనరసింహుడి కల్యాణం

గుర్రంకొండ : మండలంలోని తరిగొండ గ్రామంలో వెలసిన లక్ష్మీ నరసింహస్వామి కల్యాణోత్సవం బుధవారం వైభవంగా నిర్వహించారు. స్వాతి నక్షత్రంతో పాటు స్వామి జన్మదినం కావడంతో టీటీడీ ఆధ్వర్యంలో స్వామికి కల్యాణోత్సవం కన్నుల పండుగగా నిర్వహించారు. ఆలయంలో చలువ పందిళ్లు, పచ్చని తోరణాలతో పెళ్లి వేదిక అలంకరించారు. ముందుగా మూలవర్లకు అభిషేకాలు, అర్చనలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేకువ జామునే స్వామికి క్షీరాభిషేకం నిర్వహించారు. రంగురంగుల పుష్పాలతో స్వామిని అలంకరించిన తీరు అందరినీ అకట్టుకొంది. ముత్యాల తలంబ్రాలతో స్వామి పెళ్లి వేడుక నిర్వహించారు. వేద పండితుల మంత్రోచ్చారణ మధ్య శాస్త్రోక్తంగా మాంగల్యధారణ గావించారు. కల్యాణోత్సవం సందర్భంగా స్వామివారి ఎదుట యజ్ఞహోమాలు నిర్వహించారు. రూ.300 చెల్లించి కల్యాణోత్సవంలో పాల్గొన్న దంపతులకు టీటీడీ వారు పట్టువస్త్రాలు, కంకణాలు, స్వామి ప్రసాదాలు అందజేశారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో టీటీడీ అధికారులు, ఆలయఅర్చకులు పాల్గొన్నారు.



కల్యాణోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

వేడుకలకు హాజరైన మాజీ ఎమ్మెల్యే

కలికిరి(వాల్మీకిపురం) : మండలంలోని జర్రావారిపల్లి పంచాయతీలో వైఎస్సార్‌సీపీ నాయకుల వివాహ, గృహ ప్రవేశ కార్యక్రమాలలో పీలేరు మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి బుధవారం పాల్గొన్నారు. చీమలబండ వడ్డిపల్లికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు ఇడగొట్టి రమణ, కొత్తపల్లిలోని వైఎస్సార్‌సీపీ నాయకుడు మద్దెల కమలాకర్ల నూతన గృహ ప్రవేశ కార్యక్రమాల్లో అయన పాల్గొన్నారు. నాయకులు, కార్యకర్తలు సుఖ సంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. జెడ్పీటీసీ మాజీ సభ్యుడు చింతల శివానందరెడ్డి, మండల పార్టీ కన్వీనర్ నీళ్ల భాస్కర్, వాల్మీకిపురం ఉప సర్పంచ్ బిడ్డల కేశవరెడ్డి తదితరులు మాజీ ఎమ్మెల్యే వెంట పాల్గొన్నారు.



నూతన గృహ ప్రవేశ కార్యక్రమంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి

సంఘం రైతులదా..అధికారులదా!

- ఎఫ్‌పీఓ అవినీతి విచారణ జరపండి
- కమిటీ సమావేశంలో రైతుల డిమాండ్

బి.కొత్తకోట : రైతు ఉత్పత్తిదారుల సంఘం రైతులదా అధికారులదా.. సమావేశంలో మేం మాట్లాడకూడదంటే మేం వెళ్లిపోతాం మీరే నిర్వహించుకోండి అంటూ రైతులు అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం స్థానిక మండల సమాఖ్య కార్యాలయంలో మండల రైతుల ఉత్పత్తిదారుల సంఘ కార్యవర్గ సమావేశం జరిగింది. సమావేశానికి హజరైన కమిటీ సభ్యులు వివిధ అంశాలపై చర్చించాలని పట్టుబట్టగా అధికారులు అడ్డు తగిలారు. చర్చ జరగకుండా ప్రయత్నించడంతో సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆరునెలలుగా సంఘ సమావేశాన్ని ఎందుకు జరపలేదని నిలదీశారు. రైతులు రుణాలు అందించే వీలులేకుండా చేశారని అన్నారు. ఇప్పటికైనా రుణాలు మంజూరు చేయాలని డిమాండ్ చేయడంతో మూడు సంఘాలకు రూ.6 లక్షలు మంజూరు చేస్తూ తీర్మాణం చేశారు. గతంలో సంఘ నిధులతో జరిగిన కార్యకలాపాలు, నిధుల వినియోగం, నిర్వహించిన వ్యాపారాలపై విచారణ జరపాలని డిమాండ్ చేశారు. నిధుల దుర్వినియోగంపై ఆరోపణలు ఉన్నాయని స్పష్టం చేశారు. గత ఏపీఎం హయాంలో సంఘానికి తెలియకుండా రూ.5.75 లక్షల సొమ్మును ఎవరికిచ్చారని ప్రశ్నించారు. ఆ నిధుల వినియోగానికి సంబంధించిన బిల్లులు చూపాలని కోరారు. ఇంకా పలు అంశాలపై రైతులు అధికారులను ప్రశ్నించారు. ఇకపై ప్రతినెలా సమావేశాలు నిర్వహిస్తామని, రైతులకు రుణాలు మంజూరు చేస్తామని ఏపీఎం రాజేశ్వరీ తెలిపారు. సమావేశంలో సంఘ అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి, ఉపాధ్యక్షులు గట్టు జాకీర్, కార్యదర్శి ప్రభాకర్, దేవరింటి కుమార్ తదితరులు పాల్గొన్నారు.



రైతు ఉత్పత్తిదారుల సంఘ సమావేశం

యువత శివాజీని ఆదర్శంగా తీసుకోవాలి

మదనపల్లె సిటీ : యువత ఛత్రపతి శివాజీని ఆదర్శంగా తీసుకోవాలని బీజేపీ నాయకులు బండి ఆనంద్ అన్నారు. బుధవారం స్థానిక రింగ్‌రోడ్డు సర్కిల్‌లో విశ్వహిందూపరిషత్ ఆధ్వర్యంలో ఛత్రపతి శివాజీ జయంతి వేడుకలు నిర్వహించారు. అయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. వీహెచ్‌పీ నాయకులు సురేష్, హిందూ చైతన్య వేదిక బాలాజీ, కామేష్, బీజేపీ నాయకులు నారదరెడ్డి, జర్మన్‌రాజు పాల్గొన్నారు.

ఘనంగా ఛత్రపతి శివాజీ జయంతి

కలికిరి(వాల్మీకిపురం) : ఛత్రపతి శివాజీ జయంతి వాల్మీకీపురంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. హైందవవాది శివాజీ ఆశయ సాధనకు కృషిచేయాలని పిలుపునిచ్చారు. రవి, శీన, సాయిభార్గవ్, రామచంద్ర, రామక్రిష్ణ, ఆనంద, విష్ణు చైతన్య, ప్రసాద్, వెంకటేష్, రోహిత్, తిరుమలేష్, నాగేంద్ర, మంజునాథ్, రెడ్డిశేఖర్, నవీన్, పాల్గొన్నారు.



మదనపల్లె : మాట్లాడుతున్న బీజేపీ నాయకుడు బండి ఆనంద్

బి.కొత్తకోట : ఛత్రపతి శివాజీ జయంతిని పురస్కరించుకుని బుధవారం బి.కొత్తకోటలో హిందూ ఐక్యత వేదిక ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ జరిగింది. తొలుత శివాజీ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు.కార్యక్రమంలో గొరంట్ల రమేష్, శీలం రంగారెడ్డి, ముకుంద తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌ఎన్‌ఎస్‌ఎస్ కాలువపై బ్రిడ్జిలు నిర్మించాలి

- సూపర్ సిక్స్ అమలులో ప్రభుత్వం విఫలం
- ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి

బి.కొత్తకోట : తంబళ్లపల్లె నియోజకవర్గంలో సాగే హంద్రీ–నీవా ప్రాజెక్టు పుంగనూరు ఉపకాలువపై గ్రామాల ప్రజలు రాకపోకలకు బ్రిడ్జిల నిర్మాణం చేపట్టాలని ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్‌రెడ్డి కోరారు. బుధవారం మండలంలోని కనికలతోపులో పర్యటించిన ఆయన పార్టీ నేతలు, కార్యకర్తలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో పుంగనూరు ఉపకాలువల నుంచి నాలుగు మండలాలకు చెందిన చెరువులకు నీళ్లు పంపేలా తూములు ఏర్పాటు చేశామని గుర్తు చేశారు. 18 చోట్ల బ్రిడ్జిలను నిర్మించేందుకు గుర్తించి వాటి నిర్మాణం చేపట్టేలా చర్యలు తీసుకున్నామని చెప్పారు. ప్రస్తుతం కాలువకు కాంక్రీట్ పనులు చేపట్టడంతో తూములు, బ్రిడ్జీల నిర్మాణం చేపట్టి రైతులు, గ్రామాల ప్రజలకు ఇబ్బందులు తీర్చాలని ప్రాజెక్టు అధికారులను కోరారు. ఈ పనులు కాంక్రీట్ పనులతో పాటు చేపడితే ప్రయోజనం ఉంటుందని కోరారు. కాగా ఎన్నికల్లో సూపర్ సిక్స్ అంటూ ప్రజలకు హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చాక వాటి అమలులో ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. అప్పులు, ఆదాయం లేదని ముందస్తుగా ప్రజల్లోకి ప్రచారం తీసుకెళ్లి వాటి అమలు నుంచి తప్పించుకునే ప్రయత్నం చేస్తోందన్నారు. హామీలను అమలు చేసి తీరాల్సిందేనన్నారు. ప్రజలను మభ్యపెట్టి మోసం చేసే విధానాలు మానుకోవాలని కోరారు. వైఎస్సార్‌సీపీ శ్రేణులు గ్రామాల్లో పర్యటించాలని కోరారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రజలకు ఏమి చేసింది, కూటమి ప్రభుత్వం ప్రజలను ఎలా మోసగిస్తోందో వివరించాలన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో గ్రామాలు పూర్తి స్థాయిలో అభివృద్ధి చెందడమే కాకుండా సంక్షేమ పథకాల ద్వారా ప్రజలకు లబ్ధి కలిగిందన్నారు. లక్షలాది విద్యార్థుల భవిష్యత్‌ను తీర్చిదిద్దిన ఘనత వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డికి దక్కుతుందన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ ఖాదర్‌వలీ, వైఎస్సార్‌సీపీ బీసీ విభాగం జిల్లా అధ్యక్షుడు ఉజ్జయిని సాంబశివ, భీమిగాని పద్మనాభరెడ్డి, మాజీ విండో చైర్మన్ మిషన రామిరెడ్డి, సచివాలయాల మండల కన్వీనర్ రెడ్డిహరి, తాళ్ల చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



వైఎస్సార్‌సీపీ నాయకులతో ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్‌రెడ్డి

సారూ.. మాకు న్యాయం చేయండి

- ఆర్.పీ.సిసోడియాతో అర్జీదారులు
- గ్రీవెన్స్ ఫిర్యాదులు పరిష్కరించలేదంటూ ఆవేదన

మదనపల్లె : 'సబ్ కలెక్టరేట్ అగ్నిప్రమాద ఘటన మూడురోజుల తర్వాత రెవెన్యూశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్.పీ.సిసోడియా, భూసమస్యలపై అర్జీలు స్వీకరిస్తారని చెపితే ఎంతో ఆశపడి, ఇప్పటికైనా పరిష్కారం దొరుకుతుందని కష్టాలకు ఓర్చి అర్జీలు ఇచ్చి వెళ్లాం. ఏడునెలలు అవుతోంది. ఇప్పటివరకు మా సమస్యలు పరిష్కారం కాలేదు. మా బాధ ఎవరితో చెప్పుకోవాలి' అయ్యా.. అంటూ అర్జీదారులు రాష్ట్రప్రభుత్వ రెవెన్యూశాఖ ప్రత్యేక కార్యదర్శి ఆర్.పీ.సిసోడియా ఎదుట ఆవేదన వ్యక్తం చేశారు. సారూ మాకు న్యాయం చేయండి అని వేడుకున్నారు. సబ్ కలెక్టర్ కార్యాలయ భవన ప్రారంభోత్సవానికి వచ్చిన ఆర్.పీ.సిసోడియాతో బాధితులు తమ సమస్యలను ఏకరువు పెట్టుకున్నారు. కురబలకోట మండలం మట్టివారిపల్లె సర్వేనెంబర్.630/1లో 6.69 ఎకరాల భూమిపై మంజూరుచేసిన పట్టాదారు పాసుపుస్తకాలపై అన్నదమ్ముల మధ్య వివాదం జరుగుతోందని, డిస్ప్యూట్ రిజిస్టర్‌లో నమోదుచేయాల్సిందిగా పలుమార్లు అర్జీ సమర్పించినా అధికారులు చర్యలు తీసుకోలేదని పి.దావూద్‌ఖాన్ వాపోయారు. అలాగే మదనపల్లె మండలం బసినికొండ గ్రామం సర్వేనెం.431కు సంబంధించి 1బీ, అడంగల్ మంజూరుచేయాలని, టి.రెడ్డిశేఖర్ పేరుమీద మంజూరుచేసిన పట్టాదారు పాసుపుస్తకాలు రద్దుచేయాలని కోర్టు ఆధారాలతో చూపినప్పటికీ రెవెన్యూ అధికారులు పట్టించుకోవడం లేదని కొండామారిపల్లెకు చెందిన ఏ.వెంకటరమణారెడ్డి తెలిపారు. అలాగే రామసముద్రం మండలంలో కౌలుకు ఇచ్చిన భూమిపై దొంగ పాసుపుస్తకాలు సృష్టించుకుని, తమను భూమిలోకి రానివ్వకుండా అడ్డుకుంటున్నారని, 1బీ, పాసుపుస్తకాలు మంజూరు కాలేదని, డీకేటీ పట్టాభూమిని ఇతరులు ఆక్రమించారని పలువురు ఫిర్యాదుచేశారు. దీంతో ఆయన, జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి, సబ్ కలెక్టర్ మేఘస్వరూప్‌కు వాటిని పరిశీలించి, పరిష్కారానికి చర్యలు తీసుకోవాల్సిందిగా ఆదేశించారు.



ఆర్.పీ. సిసోడియాకు సమస్యలపై చెబుతున్న అర్జీదారులు

అర్హులకు రుణాలు అందేనా ?

పెద్దతిప్పసముద్రం : నిరుద్యోగులకు బ్యాంకుల ద్వారా ఆర్థిక సహాయం అందించి వారికి జీవనోపాధులు కల్పించేందుకు ప్రభుత్వం వివిధ కార్పొరేషన్ల ద్వారా రాయితీ యూనిట్లు మంజూరు చేసింది. ఈ నేపథ్యంలో మండలానికి బీసీ కార్పొరేషన్ ద్వారా 40 యూనిట్లు మంజూరు కాగా 315 మంది దరఖాస్తు చేసుకోగా వారికి బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహించారు. దీంతో కార్యాలయం లోపల, బయట నిరుద్యోగులతో కిటకిటలాడిపోయింది. దరఖాస్తుదారులు మాత్రం ఎలాగైనా మాకే రుణాలు వచ్చేలా చూడాలని కూటమి నాయకుల వెంట పడుతున్నారు. అయితే రుణాలు ఎవరికి మంజూరు చేయాలో ఇప్పటికే జాబితా ఖరారైపోయి ఉంటుందని దరఖాస్తుదారుల ఆత్మ సంతృప్తి కోసం ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నారని పలువురు ఎద్దేవా చేస్తున్నారు.

సబ్సిడీ రుణాలకు ఇంటర్వ్యూలు

నిమ్మనపల్లె : వివిధ కార్పొరేషన్ల ద్వారా అందించే రాయితీ రుణాలకై బుధవారం నిర్వహించిన ఇంటర్వ్యూలకు 219 మంది హాజరయ్యారని ఎంపీడీఓ పరమేశ్వర్ రెడ్డి తెలిపారు. ప్రభుత్వం నిరుద్యోగ యువత స్వయం ఉపాధి కల్పన కోసం బీసీ, ఈబీసీ, ఈడబ్ల్యూఎస్, కాపు కార్పొరేషన్ల ద్వారా 50 శాతం సబ్సిడీతో అందిస్తున్న రుణాలకు ఎంపీడీవో కార్యాలయంలో నిమ్మనపల్లె ఇండియన్ బ్యాంక్ మేనేజర్ చంద్రయ్య, నిమ్మనపల్లె సప్తగిరి గ్రామీణ బ్యాంక్ అసిస్టెంట్ మేనేజర్ కే. రామాంజులు తో కలిసి ఎంపీడీవో పరమేశ్వర్ రెడ్డి, ఈవోపీఆర్డీ చలపతిరావు ఇంటర్వ్యూలను నిర్వహించారు.

సబ్సిడీ రుణాలకు ఇంటర్వ్యూలు

తంబళ్లపల్లె : ప్రభుత్వ సబ్సిడీ రుణాల కొరకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు బుధవారం ఎంపీడీఓ కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఎంపీడీఓ ఉపేందర్‌రెడ్డి మాట్లాడుతూ మండలానికి 51 యూనిట్లు మంజూరు కాగా సుమారు 235 మంది దరఖాస్తు చేసుకున్నట్లు తెలిపారు. తంబళ్లపల్లె ఇండియన్ బ్యాంకు, ఎస్‌బిఐ, కోసువారిపల్లె ఇండియన్ బ్యాంకు, సప్తగిరి గ్రామీణ బ్యాంకు చౌడసముద్రం, ముదివేడు, గుర్రంకొండ బ్రాంచి అధికారులు ఇంటర్వ్యూలు నిర్వహించారు.

కార్పొరేషన్‌ల రుణాలకు ఇంటర్వ్యూలు

పెద్దమండ్యం : కార్పొరేషన్ రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న నిరుద్యోగ యువతీ యువకులకు బుధవారం అధికారులు ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఇందులో బీసీలకు 40 యూనిట్‌లు, కాపులకు 8 యూనిట్‌లు, క్షత్రియులకు 1, రెడ్డి, ఈబీసీలకు రెండు చొప్పున కేటాయించారు. రుణాల కోసం 343 మంది దరఖాస్తు చేసుకున్నట్లు అధికారులు తెలిపారు. బ్యాంక్, ఎంపీడీవో కార్యాలయం అధికారులు ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఎంపీడీవో శ్రీధర్‌రావు, సీనియర్ అసిస్టెంట్ నాగేంద్ర, బ్యాంక్ మేనేజర్‌లు పాల్గొన్నారు.

రుణాలకు ఇంటర్వ్యూలు

బి.కొత్తకోట: బీసీ కార్పొరేషన్ల ద్వారా నిరుద్యోగుల ఉపాధి కోసం రుణాల మంజూరుకు దరఖాస్తు చేసుకున్న వారికి బుధవారం స్థానిక నగర పంచాయతీ కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహించారు. బ్యాంకులకు చెందిన మేనేజర్లు, కమిషనర్ జీవీ పల్లవి ఇంటర్వ్యూలు నిర్వహించగా 293 మంది అభ్యర్థులకుగాను 173 మంది హాజరయ్యారు.

రాయితీ రుణాల కోసం బారులు

కలకడ : రాయితీ రుణాల కోసం నిర్వహిస్తున్న మౌఖిక పరీక్షలకు మండలంలోని నిరుద్యోగ యువతీ, యువకులు బుధవారం బారులు తీరారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో వివిధ కార్పొరేషన్ల నుంచి రుణాల మంజూరుకు 344మంది దరఖాస్తు చేసుకున్నారు. ఎంపీడీఓ అబ్దుల్ రహీం బుధవారం 178 మందికి ఇంటర్వ్యూలు నిర్వహించారు. బ్యాంకు మేనేజర్లు రూపేంద్రనాయక్, కె.వి.వివరామిరెడ్డి, షేక్షావలి తదితరులు పాల్గొన్నారు.

రుణాల మంజూరుకు మౌఖిక పరీక్షలు

పీలేరురూరల్: మండలంలో బీసీ, ఈడబ్ల్యూఎస్, కాపు కార్పొరేషన్ రుణాల మంజూరుకు ఇంటర్వ్యూలు నిర్వహించినట్లు ఎంపీడీవో జి.శివశంకర్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన ఇంటర్వ్యూలకు 408 మంది హాజరైనట్లు తెలిపారు. బీసీ కార్పొరేషన్‌కు 56, ఈడబ్ల్యూఎస్‌కు 10, కాపులకు పది యూనిట్లు ఉండగా, 546మంది దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు అధికారులు పాల్గొన్నారు.

ఇన్‌చార్జి సర్వేయర్‌గా కీర్తన

పీలేరు : పీలేరు మండల ఇన్‌చార్జి సర్వేయర్‌గా కీర్తన బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇదివరకూ ఇక్కడ సర్వేయర్‌గా ఉన్న కిరణ్మయి బదిలీపై గుర్రంకొండకు వెళ్లారు. కేవీపల్లె సర్వేయర్‌గా పనిచేస్తున్న కీర్తన పీలేరు మండలానికి ఇన్‌చార్జి సర్వేయర్‌గా బాధ్యతలు స్వీకరించారు.

ఈనెల22న మండల సర్వసభ్య సమావేశం

పెండ్లిమర్రి : ఈనెల 22వ తేదీన ఉదయం 10 గంటలకు మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ ఎం.వరలక్ష్మి అధ్యక్షతన నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో జగన్‌మోహన్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సర్వసభ్య సమావేశానికి ప్రజాప్రతినిధులు, మండలస్థాయి అధికారులు తప్పక హాజరుకావాలని ఆయన కోరారు.

వైభవంగా విగ్రహ ప్రతిష్ట

పెద్దమండ్యం : పెద్దమండ్యం గ్రామంలోని బిక్కావాండ్లపల్లెలో నాగదేవత, నవగ్రహ విగ్రహ ప్రతిష్టా కార్యక్రమం బుధవారం వైభవంగా జరిగింది. మూడు రోజుల పాటు విగ్రహ ప్రతిష్ట కార్యక్రమంలో భాగంగా వేదపండితులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. విగ్రహాలను గ్రామ దేవతలకు పూజలు నిర్వహించి పల్లె పురవీధులలో ఘనంగా ఊరేగించారు. బుధవారం ప్రాణప్రతిష్ట కార్యక్రమం వేదపండితుల మంత్రోచ్చారణల మధ్య ఘనంగా జరిగింది. భక్తులు, ప్రజల కోసం దాత చిన్నరెడ్డెప్ప కుటుంబ సభ్యులు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. విగ్రహాల ఊరేగింపు సందర్భంగా బిక్కావాండ్లపల్లెకు చెందిన కోలాటం బృందం వారు కోలాటం వేశారు. కార్యక్రమంలో వేదపండితులు మణికంఠ శర్మ, గ్రామస్తులు పాల్గొన్నారు.

యోగాతో ఆరోగ్యం

మదనపల్లె సిటీ : యోగా చేయడం వల్ల ఆరోగ్యంగా ఉంటారని దత్తక్రియ యోగ ఇంటర్నేషనల్ సెంటర్ కోఆర్డినేటర్ జి.చంద్రశేఖర్ అన్నారు. బుధవారం స్థానిక రెడ్డీస్ కాలనీలో మైసూరు దత్తపీఠంవారిచే క్రియయోగ తరగతులు నిర్వహించారు. క్రియాయోగ వల్ల ఎన్నో అద్బు ఫలితాలు ఉంటాయన్నారు. మానసిక ఆరోగ్యంగాని శారీరకంగాని చాలా మెరుగుపడుతాయన్నారు. ఉచిత దత్తక్రియ యోగా నేర్చుకుని ఆరోగ్యవంతులుగా ఉంటారన్నారు. మరిన్ని వివరాలకు 7780121569 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

మంచినీరు అధికంగా తాగాలి

కలకడ : విద్యార్థులు ఎత్తుకు తగిన బరువు ఉండాలని.. వేసవిలో వడదెబ్బ నుంచి తప్పించుకోవడానికి మంచినీరు అధికంగా తాగాలని కలకడ పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ మల్లికార్జున సూచించారు. కలకడ ఆదర్శ పాఠశాల విద్యార్థులకు ఆరోగ్య సిబ్బందితో కలిసి బుధవారం వైద్య పరీక్షలు నిర్వహించారు. డాక్టర్ మల్లికార్జున మాట్లాడుతూ నొప్పి, దురదలు రాణి మచ్చలు, పొడలు ఉంటే తెలియజేయాలని కోరారు. ఎలాంటి అనారోగ్య సమస్యలున్నా వైద్య సేవలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ మల్లంగ్‌షావల్లి, తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులకు పాఠశాలపై మక్కువ

కలకడ : ప్రైవేట్ పాఠశాలల తరహాలో నర్సరీ, ప్లే క్లాసులు కాకుండా అంగన్‌వాడీ కేంద్రాల్లో జ్ఞానజ్యోతి కార్యక్రమం పెట్టడంతో చిన్నారులు మక్కువ పెంచుకుంటున్నారని ఐసీడీఎస్ పీడీ రమాదేవి, కోర్సు డైరెక్టర్ మునీంద్ర నాయక్ అన్నారు. మండలంలోని కలకడ ఆదర్శపాఠశాలలో అంగన్‌వాడీ సిబ్బందికి జ్ఞాన జ్యోతిపై జరిగే శిక్షణ కార్యక్రమాన్ని ఆమె తనిఖీ చేశారు. ఆన్‌లైన్, నేరుగా డైరెక్టర్ సూచనలు, సలహాలు తీసుకుని చిన్నారులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని సిబ్బందిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ–2 రామచంద్రారెడ్డి, శాంత, యశోద, రెడ్డినాగయ్య, అంజాద్‌అలీ, శంకర్‌ప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

శివరాత్రికి ప్రత్యేక బస్సులు

మదనపల్లె సిటీ: ప్రముఖ శైవక్షేత్రమైన తంబళ్లపల్లె మల్లయ్యకొండకు శివరాత్రిని పురస్కరించుకుని ప్రత్యేక బస్సులు నడపనున్నట్లు ఆర్టీసీ–1 డిపో మేనేజర్ మూరే వెంకటరమణారెడ్డి తెలిపారు. బుధవారం సిబ్బందితో శివరాత్రి స్పెషల్ బస్సుల ఆపరేట్‌పై సమీక్షా సమావేశం నిర్వహించారు. శివరాత్రి 26,27 తేదీల్లో తంబళ్లపల్లె మల్లయ్యకొండకు సప్తగిరి ఎక్స్‌ప్రెస్‌లు నడపనున్నట్లు తెలిపారు. మదనపల్లె నుంచి మల్లయ్యకొండకు 20, మల్లయ్యకొండ కింద నుంచి కొండకు 35, రాగిమాను సర్కిల్ నుంచి కొండకిందకు 10 బస్సులు నడపనున్నట్లు తెలిపారు. పెద్దమండ్యం నుంచి మల్లయ్యకొండకు 2, బి.కొత్తకోట నుంచి 2, ములకలచెరువు 2 బస్సులు నడపనున్నట్లు పేర్కొన్నారు. అంగళ్లు నుంచి చిన్న మల్లయ్యకొండకు 10 బస్సులు నడపనున్నట్లు తెలిపారు. అవసరాన్ని బట్టి మరిన్ని బస్సులు నడుపుతామన్నారు. భక్తులు ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించాలని కోరారు. సీఐ రేవతి, ఎంఎఫ్ రేవతి పాల్గొన్నారు.